క్లుప్తంగా

292 మందికి కంటి పరీక్షలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని వించిపేట మహ్మదాలీపు రంలోగల మున్సిపల్ స్కూల్ ఆవరణలో ఉన్న ఉర్దూ ఎలిమెంటరీ, సాధారణ స్కూల్స్‌లో అయాన్ ఐ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో విద్యార్థులు, వారి తల్లిదం డ్రులు, సిబ్బందితో పాటు స్థానికులు కలిపి సుమారు 292 మందికి నేత్ర పరీక్షలు చేశారు. కంటికి సంబంధించిన వివిధ సమస్యలపై అయాన్ హాస్పిటల్ చీఫ్ డాక్టర్ బషీర్ అహ్మద్ తన వైద్య సిబ్బందితో కలిసి అధునాతన వైద్య పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు ఉచితంగా అందజేశారు. హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ కంటి వైద్య శిబిరంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నగరాజకుమారి, కరిముల్లా, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మార్జిన్ మనీ పేరుతో కార్మికులను దోచుకోవద్దు



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థకు చెందిన ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాలలో మార్జిన్ మనీ పేరుతో దోచుకోవడం తగదని, ఎటువంటి మినహాయింపులు లేకుండా మున్సిపల్ కార్పొరేషన్ ద్వారానే జీతాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం 44వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా అవుట్‌సోర్సింగ్ కార్మికుల జీతాల నుంచి ఒక శాతం మార్జిన్ మనీ పేరుతో రూ.225 వరకు కోత విధించడం అన్యాయమన్నారు. రానున్న కాలంలో కాంట్రాక్ట్ వ్యవస్థను తీసుకువచ్చి నాలుగు శాతం మార్జిన్ మనీ వసూలు చేసేందుకు చూస్తున్నారని తెలిపారు. దీని ప్రకారం రూ.900 వారి జీతం నుంచి చెల్లించాల్సి వస్తుందని అన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా కార్పొరేషనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

దీక్షలు స్వీకరించిన క్రైస్తవులు



పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించి చేపట్టే ఉపవాస దీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా విభూది బుధవారంగా భావించే ఈ దీక్షలను పెజ్జోనిపేట, ఆర్‌సీఎం చర్చిలో విచారణ గురువులు ఫాదర్ జేమ్స్ ఆధ్వర్యంలో స్వీకరించారు. సుమారు 150 మంది భక్తులు మాలధారణ చేపట్టి ఉపవాస దీక్షలను స్వీకరించారు. నలభై రోజుల పాటు నిష్ఠతో ఈ దీక్షలను కొనసాగిస్తారు. దీనిలో భాగంగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలిపూజ కార్యక్రమాలు జరుగుతాయని ఫాదర్ జేమ్స్ తెలిపారు. రాష్ట్రం, దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫాదర్‌లు ప్రేమ్‌కుమార్, శామ్యేలు, జీవన్, మాథ్యూస్, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

నిధులున్నా అభివృద్ధి సున్నా!

- చినుకు పడితే చెరువును తలపిస్తుంది
- పాలకుల నిర్లక్ష్యమా.. అధికారుల అలసత్వమా?
- విజిటింగ్ ప్రొఫెసర్‌లా పశ్చిమ ఎమ్మెల్యే

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి గుప్తా సెంటర్ వరకు అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి అవసరమైన నిధులు ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు మాత్రం జరగడం లేదు. 'అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని' అన్న చందాన పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని 39వ డివిజన్ పరిస్థితి. ఈ డివిజన్ పరిధిలో డ్రెయిన్ నిర్మాణ పనుల నిమిత్తం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే (2023) నగరపాలక సంస్థ జనరల్ ఫండ్స్ నుంచి రూ.34 లక్షలు మంజూరు చేసింది. తిరుపాల్ అనే వ్యక్తి టెండర్ కూడా దక్కించుకున్నారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు మొదలు పెట్టడం ఆగిపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా కాంట్రాక్టర్ ఎందుకు ముందుకు రావడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. నగరపాలక సంస్థ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు మంజూరయ్యాయంటే.. పని పూర్తయితే బిల్లు కచ్చితంగా వస్తుందన్నది కాంట్రాక్టర్లకు తెలిసిన విషయమే. అయినా ఇంతవరకు దాదాపు అర కిలోమీటర్ దూరం మేరకు అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించలేదంటే పాలకుల నిర్లక్ష్యమా లేదంటే అధికారుల అలసత్వమా?



వర్షం కురిసినప్పుడు చెరువును తలపిస్తున్న కుమ్మరిపాలెం సెంటర్(ఫైల్)

అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని ఎక్కడికో తీసుకువెళతానని ఎన్నికలకు ముందు హామీలు గుప్పించిన పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి గెలవగానే నియోజకవర్గానికి అప్పుడప్పుడు విజిటింగ్ ప్రొఫెసర్‌లాగా వచ్చి వెళుతుంటే తాము ఎవరిని అడగాలని స్థానికులు తలలు పట్టుకుంటున్నారు.

చినుకు పడిందంటే చాలు...

చినుకు పడిందంటే చాలు 38–39 డివిజన్లకు అనుసంధానంగా ఉన్న విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో రహదారి జలమయమై చెరువును తలపిస్తుంది. ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటమే అందుకు ప్రధాన కారణం. ఈ సమస్యకు పరిష్కార మార్గం స్థానిక పెద్దలకు తెలిసినంతగా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులకు కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు. తాము చెబుతున్నా.. మీరు మాకు చెప్పేదేంటన్న అహంతో పట్టించుకోకుండా వారి ఇష్టారాజ్యంగా పనులు చేసుకుంటూ పోవడమే ఈ ముంపు దుస్థితికి కారణమని విశ్రాంత ఇంజినీరింగ్ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. అప్పటి నుంచి వారు కూడా అధికారులకు చెప్పటం మానేసి ముంపు కష్టాలకు అలవాటు పడిపోయారు. భారీ వర్షం కురిసినప్పుడు రహదారిపై మోకాళ్ల లోతు నిలిచిపోయిన నీటిని ఎటు మళ్లించాలో కూడా అర్థం కాని పరిస్థితి సంబంధిత అధికారులది. వర్షం తగ్గిన తరువాత నెమ్మదిగా వాటంతట అవే సైడు డ్రెయిన్లలోకి వెళ్లిపోతుంటాయి. అప్పటి వరకు వీఎంసీ అధికారులు చోద్యం చూడటం మినహా తగిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, కనీసం ముంపు సమస్య పరిష్కార దిశగా ఆలోచన కూడా చేయరని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.



అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాల్సింది ఇక్కడి నుంచే..

క్రాస్ కల్వర్ట్ సరే.. అక్కడి నుంచి డ్రెయిన్ ఏదీ?

విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధి (38వ డివిజన్) కొండ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున దిగువకు వచ్చే వర్షపు నీటి ఎద్దడిని తట్టుకునేందుకు దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (39వ డివిజన్ పరిధి) వద్ద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.9.30 లక్షల వ్యయంతో క్రాస్ కల్వర్ట్ నిర్మించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. కొండపై నుంచి భారీగా వచ్చే వర్షపు నీరు క్రాస్ కల్వర్ట్ ద్వారా రోడ్ పక్కన అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి వెళ్లాల్సి ఉంది. మంజూరయిన నిధులతో ఆ డ్రెయిన్ నిర్మాణం చేపట్టక పోవడంతో క్రాస్ కల్వర్ట్ వలన ప్రయోజనమేమిటని



క్రాస్ కల్వర్ట్ ద్వారా వచ్చే నీరు కలవాల్సి ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్

స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు డివిజన్‌లో హడావుడి చేయడం తప్ప ప్రజా సమస్యలను పట్టించుకుని పరిష్కరించేవారే లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానికంగా ఉంటే సమస్య చెప్పుకోవడానికి అవకాశం ఉంటుందని, నెలకు ఒకటి రెండు పర్యాయాలు నియోజకవర్గానికి వచ్చినా వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొంటారు తప్ప, ఎన్నికల్లో గెలిచిన తరువాత నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పర్యటించిన దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన పర్యటనలో భాగంగా కృష్ణలంక ప్రాంతంలోని 20, 21, 22 డివిజన్లలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెట్లబజార్ చివర ఉన్న చేతి పంపును పరీక్షించారు. ఎప్పటికప్పుడు అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రస్తుతం ఉన్న తాగునీటి బోర్లు పనిచేస్తున్నాయా లేదా వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్వర్గపురి ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, అవసరమైన వసతులన్ని కల్పించాలని, ఈ ప్రాంతాన్ని, ఘాట్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే రిపేరు చేయించి పూర్తిస్థాయిలో అందుబాటులో తీసుకురావాలని ఆదేశించారు.



కృష్ణలంకలో చేతి పంపును పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ పరిశీలన..

అనంతరం ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్ పక్కనే ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. నిత్యం అన్న క్యాంటీన్‌ను అధికారులు పరిశీలించాలని, ఆహార నాణ్యతలో ఎటువంటి లోపం లేకుండా చూడాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. కృష్ణలంక డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించి అక్కడ జరుగుతున్న పనులను సత్వరమే పూర్తి చేయాలని, ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె.షమ్మీ, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపీనాయక్, బయాలజిస్ట్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికన్ యూనివర్సిటీల్లో విద్యార్థులకు ప్రవేశాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తమ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న ఆదిత్య, కీర్తికా, కౌశిక్‌లు అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందడంతో పాటు అత్యధికంగా స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించారని శారదా విద్యాసంస్థల చైర్మన్ వై. రమేష్ బాబు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న కళాశాల ఆవరణలో విద్యార్థులను బుధవారం అభినందించారు. రమేష్ బాబు మాట్లాడుతూ.. మిరియాల ఆదిత్య, చెరుకూరి కౌశిక్, పాతూరి కీర్తికా బీటెక్‌లో ప్రవేశంతో పాటు వరుసగా ఏడాదికి రూ.2.40 కోట్లు, రూ.1.02 కోట్లు, 10 వేల డాలర్ల స్కాలర్‌షిప్ సాధించారన్నారు. శారదా విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి మాట్లాడుతూ.. ఇన్విక్టా



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఎండీ శారదాదేవి, ప్రసాద్, జీవీ రావు

అనే సంస్థతో తాము భాగస్వాములను చేసుకుని ప్రత్యేకమైన శాట్ ప్రోగామ్‌ను విద్యార్థులను అందిస్తున్నామన్నారు. విద్యార్థులను కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే.ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ.రావు, అధ్యాపకులు అభినందించారు.

సందడిగా అంత్యాక్షరి పోటీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థలకు చెందిన మహిళా సిబ్బందికి బుధవారం కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో అంత్యాక్షరి పోటీలను నిర్వహించారు. పోటీలు ఆద్యంతం సందడిగా కొనసాగాయి. ఈ పోటీల్లో మొత్తం 15 జట్ల నుంచి 150 మంది మహిళలు పాల్గొన్నారు. అలనాటి పాత చిత్రాల నుంచి ఈనాటి చిత్రాల వరకు వచ్చిన పాటల్ని మహిళలు గానం చేసి ప్రతిభను ప్రదర్శించారు. బహుమతి ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హిందూహైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య మాట్లాడుతూ మహిళల్లో అనంతమైన ప్రతిభ దాగి ఉందని, వారిని ప్రోత్సహిస్తే ఊహించని విజయాలు సాధిస్తారన్నారు. తమ గ్రూప్ సంస్థల్లో 70 శాతం మంది మహిళా ఉద్యోగులే ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో కేబీఎన్. కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, చిట్టూరి హైస్కూల్ అధ్యక్షుడు ఆనంద రామ సుధాకర్, కార్యదర్శి సామ మణికంఠ, హిందు హైస్కూల్ కమిటీ కోశాధికారి గోళ్ళ బాబావిజయ్ కుమార్, కమిటీ సభ్యులు మద్ది సుబ్బారావు, ఉసిరిక ఉమామహేశ్వరరావు, దోగిపర్తి సుజాత తదితరులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు మాడుగుల వరప్రసాద్, గుండా గంగాధర్ పోటీలు నిర్వహించారు.



పోటీల్లో పాల్గొన్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు

మహిళలపై వివక్ష లేని సమాజం నిర్మించాలి

డీసీపీ కేజీవీ సరిత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): మహిళలపై వివక్ష లేని సమాజ స్థాపన కృషికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని డీసీపీ కేజీవీ సరిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దక్షిణ మధ్య విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం రైల్వే ఆడిటోరియంలో 'మహిళల భద్రత, స్వీయరక్షణ'పై వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీసీపీ సరిత మాట్లాడుతూ మహిళలు తమను తాము తక్కువ చేసుకోకుండా ఆత్మవిశ్వాసం, స్వీయ రక్షణ, శారీరక దృఢత్వంతో ఎటువంటి కష్టాలనైనా సులభంగా అధిగమించవచ్చని తెలిపారు. ఇటీవల కాలంలో మహిళలనే లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసం పోలీసు శాఖ ఎన్నో ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టిందన్నారు. సురక్ష కమిటీలు ఏర్పాటు చేయడం, హాట్‌స్పాట్‌ల గుర్తింపు కోసం డ్రోన్‌లు, సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా వ్యవస్థ, పోలీస్ పెట్రోలింగ్ తదితర భద్రత చర్యలను వివరించారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో వారిని వారు రక్షించుకునేలా రూఫస్ కుంగ్-ఫూ బృందం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్వీయ రక్షణ పద్ధతులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పర్సనల్ బ్రాంచ్ ఏపీఓ పి.మల్లేశ్వరిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్ బాబు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



స్వీయరక్షణ పద్ధతులను ప్రదర్శిస్తున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బాలికలు



మాట్లాడుతున్న డీసీపీ సరిత

నియోజకవర్గ సమస్యలు పట్టవా?

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంటిబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అసెంబ్లీ సమావేశాల్లో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ బ్రహ్మాండం అంటూ భజన చేయటం తప్ప నియోజకవర్గ సమస్యలు పట్టవా అని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నియోజకవర్గంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటిని అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కారానికి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తారని గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే మీరు చేసిన ప్రసంగం విని నియోజకవర్గ ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. నియోజకవర్గ సమస్యలను వదిలేసి రాయలసీమ ప్రాజెక్ట్‌ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి గురించి అసెంబ్లీలో గళం విప్పాలని హితవు పలికారు.

ఏకగ్రీవంగా ఎంఎస్ఎంఈ చాప్టర్ జనరల్ బాడీ ఎన్నిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాప్టర్ జనరల్ బాడీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఎంఎస్ఎంఈ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ చైర్మన్‌గా దాసరి దేవరాజ్, జాతీయ అధ్యక్షుడిగా ఆర్.వీరారెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్ శివానంద్, రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ ఏడుకొండలు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు శివ రేణుక బాబు, విజయ్ కిరణ్, రామారావు, నాగ అంజలి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు అమలులో ఉంటుంది. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ దాసరి దేవరాజ్ మాట్లాడుతూ తాము ప్రభుత్వ సేవలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కొత్తగా ఎన్నికైన బృందం ఎంఎస్ఎంఈలకు బలమైన మద్దతుగా వ్యవహరించి, వాణిజ్య రంగంలో పోటీ సామర్థ్యాన్ని పెంచేందుకు, కొత్త వ్యాపార అవకాశాలను అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

దేశంలో సామాజిక విప్లవం మొదలైంది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతదేశంలో సామాజిక విప్లవం మొదలైందని వక్తలు పేర్కొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో స్టాలిన్ వర్ధంతి సందర్భంగా సామాజిక విప్లవ సదస్సు బుధవారం జరిగింది. సదస్సులో సోషలిస్ట్ కూటమి జాతీయ నేత ఎల్.జైబాబు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమం ద్వారానే అసమానతలు తొలగిపోతాయన్నారు. సామాజిక విప్లవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే దేశంలో ప్రారంభమైందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని, అపుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు మేలు జరిగే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని చెప్పారు. సదస్సులో సోషలిస్ట్ కూటమి రాష్ట్ర కార్యదర్శి పొదిల వెంకట్రావు, ఆర్టీఐ ఫోరమ్ జాతీయ అధ్యక్షుడు పత్తిపాటి చంద్రమోహన్, ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి ఎం.రామకృష్ణ, అడపా మోహన్, ప్రజా అధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ములింటి సుదర్శన్, బసవయ్య, అశోక్, అంగడాల పూర్ణ, శ్రీనివాస్ జల్లి, వసంత జల్లి, కార్ల్‌మార్క్స్, పద్మారావు, పుల్లారావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



స్టాలిన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సోషలిస్ట్ కూటమి నేతలు

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భార్య కనిపించడం లేదంటూ భర్త కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట యాదవపురం వారి వీధికి చెందిన సరగడ బంగారయ్య, అపర్ణ భార్యభర్తలు. వీరికి నాలుగేళ్ల కిందట వివాహమైంది. గత కొంత కాలంగా భార్యభర్తలకు వివాదం చోటు చేసుకుంది. వేరే కాపురం పెడదామని అపర్ణ కొంత కాలంగా భర్తను అడుగుతుండగా, తల్లితోనే ఉండాలని బంగారయ్య చెప్పసాగాడు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ తెల్లవారుజాము నుంచి అపర్ణ కనిపించడం లేదు. దీంతో తెలిసిన వారి, బంధువుల ఇంట విచారించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హోంగార్డ్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం

విజయవాడస్పోర్ట్స్: సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో హోం గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజేష్ కుమారుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేసింది. రాజేష్ ఇంట్లో తన పదేళ్ల కుమారుడు ప్రమాదవశాత్తూ వాటర్ హీటర్‌పై పడి క్షతగాత్రుడయ్యాడు. బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం హోం గార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.25 వేలు, అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత, కార్యాలయ పరిపాలన విభాగం రూ.50 వేలు, జిల్లా పోలీస్ గ్రూప్ రూ.25 వేలను సమకూర్చింది. ఈ నగదు చెక్కులను బాలుడి కుటుంబ సభ్యులకు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో హోం గార్డ్స్ ఆర్ఐ కె.సుధాకరరెడ్డి, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



తపస్సు కాల ప్రార్థనలు ప్రారంభం

- భక్తిశ్రద్ధలతో విభూతి బుధవారం
- మాలలు ధరించిన క్రీస్తు విశ్వాసులు
- గుణదల గిరికి ఆధ్యాత్మిక శోభ

గుణదల(విజయవాడతూర్పు): పరిపూర్ణ మనసుతో దేవుని సన్నిధిని సమీపించి ప్రార్థనా జీవితాన్ని గడపటం ద్వారా ఆధ్యాత్మిక మేలు పొందవచ్చని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు అన్నారు. విభూతి బుధవారం సందర్భంగా గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో తపస్సు కాల ప్రార్థనలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రధానాలయంలో ప్రత్యేక సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, దేవునిపై విశ్వాసం పెంపొందించే దిశగా కథోలిక సంప్రదాయం ప్రకారం తపస్సు కాల ప్రార్థనల ఆచారం మొదలైందన్నారు. క్రీ.శ. 302 నుంచి శ్రీసభ ఈ ప్రత్యేక ప్రార్థనల సంప్రదాయాన్ని కొనసాగిస్తోందన్నారు. కథోలిక క్రైస్తవులు ఈ భస్మ బుధవారం రోజున మాలలు ధరించి నలభై దినాల పాటు పరిపూర్ణ ప్రార్థనా జీవితాన్ని గడుపుతారని తెలిపారు. 40 దినాలను తపస్సు కాలంగా పరిగణిస్తారని పేర్కొన్నారు.



గుణదలలో శిలువను దర్శించుకుంటున్న భక్తులు

సమష్టి దివ్యబలి పూజ..

దేవుని పట్ల విశ్వాసాన్ని కలిగి తపస్సు కాల ప్రార్థనలు చేయడంతో భక్తులకు ఆధ్యాత్మిక దీవెనలు లభిస్తాయని చెప్పారు. దేవునికి విధేయులుగా ఉంటూ పవిత్రమైన జీవితాన్ని గడపటం ద్వారా జీవితంలో శాంతి సమాధానాలు నెలకొంటాయన్నారు. దేవుడిని అనుసరించి ప్రేమ, జాలి, దయ, కరుణ వంటి సద్గుణాలు అలవరుచుకోవాలని సూచించారు. శారీరక, మానసిక బలహీనతలను విడిచిపెట్టి దేవునిపై ఆధారపడాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు శిలువ మాలలను ధరించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర గురువులు, పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు హాజరయ్యారు.

మైనార్టీలకు ఇచ్చిన హామీల మాటేమిటి బాబూ..?

భవానీపురం(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీల మాటేమిటని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ ప్రశ్నించారు. భవానీపురం హెచ్‌బీ కాలనీలోగల మసీదు వద్ద ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు కూటమి ప్రభుత్వం మైనార్టీలకు తొమ్మిది ప్రధాన వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 9 నెలలయినా వాటిల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. రంజాన్ తోఫా, షాదీ తోఫా వంటి పథకాలు ఇస్తామని ఊదరగొట్టి ఇప్పుడు వాటి ఊసే ఎత్తకపోవడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకుడు వాహెద్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ ఎండీ యూనస్, పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.